# శ్రీరామచంద్ర చైతన్యము

పరబ్రహ్మాండ (Supra Cosmic) కన్నను అతి ఉన్నతమైన స్థితినుండి, కాంతి మరియు శబ్దములకన్న సూక్ష్మ మైన శక్తి ప్రవహించుచున్నది. కొందరు వారి నమ్మకము మరియు పరిపాటి ననుసరించి దీనిని మూలము, బ్రహ్మము, పరతత్వము, అనంతత్వము లేదా దైవము నుండి ప్రవహించునదిగా సంబోధించిరి. అది తమ్ స్థితినుండి వచ్చునదని చెప్పిన చాలును. పరబ్రహ్మాండ, బ్రహ్మాండ స్థితులలో గమనించిన ఈ ప్రవాహము, స్వచ్ఛతతో అంతరిక్షము, కాలము, శక్తి మరియు ద్రవ్యములందు పయనించును. ఈ విశ్వమంతటిని వొకటిగా నుంచుటకు ఈ ప్రవాహమే కారణము. అందువలన దీనిని ప్రాణశక్తి లేదా ప్రాణ అని సంబోధించెదరు.

ప్రాణశక్తి (చైతన్యము) మరియు కాల శక్తి (జడత్వము) నడుమ సమన్వయమే ఈ భువిపై జీవనములో ప్రధానమైనది. కాలశక్తి చేత అస్థిత్వము యొక్క సంఘటితశక్తిని బహిర్గతము చేయుటలో కలుగు జడత్వమును అధిగమించుటకు యెల్లవేళలా ప్రాణశక్తి క్రిందికి వచ్చి చైతన్యముతో సమన్వయపరచుచుండును.

ప్రకృతిలో భౌతిక సంబంధమైన సవాళ్లను యెదుర్కొనుటలో తగిన సమర్థతలేని మానసిక శక్తి కన్నను ప్రాణశక్తి దివ్య మైనది. ఇదియేగాక మనస్సు తనకున్న చిక్కు సమస్యలను వొక వినోదముగా భావించుచు వాటిని అనుభవించును.

మనము నివసించు భూగ్రహము దురదృష్టవశమున రణభూమిగా మారినది. కొంతకాలము ప్రశాంతముగా వుండి వెనువెంటనే యేదోవొక యుద్ధము లేదా ఘర్షణ సంభవించుచుండును. జీవితములో సుఖ దుఃఖములు, జీవన్మరణములు సాధారణమైనవి. ఇంకను జీవితము రోదనతో మొదలిడి దానితోనే అంతమై మధ్యలో మనకు కలుగు సంతోషము లేదా ఆనందము వొక మజిలీ మాత్రమే అని మనకు తెలిసినదే. ఈ భువిని స్వర్గధామముగా మలచవలెనన్న, మన చైతన్యము భౌతిక, మానసిక, జీవాత్మ స్థితులకు అతీతమైన ప్రాణ స్థితిలో నివసించవలెను.

ఈ ప్రాణాశక్తి లేదా/ప్రాణ అనేక చైతన్యస్థితులలో బహిర్గతమగుచు సమతుల్యాత కొనసాగుటకు సహాయపడు చున్నది. తమ జీవితములో పురోగతిచెంది, మహోన్నత చైతన్యస్థితులకు చేరుకొనిన మహానుభావులకు ఈ సమతుల్యతను కాపాడు బాధ్యత అప్పగించబడుచున్నది. అటువంటి పవిత్ర ఆత్మలు సృష్టిలోని వివిధ స్థితులలో పనిచేయుచున్నారు. ఇటువంటి మహాపురుషులు బ్రహ్మాండ మరియు పరబ్రహ్మాండ స్థితులలో సమతుల్యతను కాపాడు తమ

కార్యమును కొనసాగించుచున్నారు. వీరు సృష్టిలో నలుమూలలందు వున్నారు, వుంటారు. కాని వీరందరు ప్రాణశక్తినే బహిర్గతము చేసెదరు.

వీరు అతి ఉన్నతమైన ప్రాణశక్తి సంకల్పమునకే శరణాగతులై వుండు పరంపరకు చెందినవారై యుందురు. వారికి తమ స్వసంకల్పమేమియు ప్రత్యేకించి వుండదు. వారి చైతన్యము ప్రాణశక్తి యొక్క అదుపాజ్ఞలలో పనిచేయుచుండును. శ్రీ కృష్ణభగవానుడు, భగవాన్ శ్రీ రాముడు, భగవాన్ బుద్ధుడు, జీసస్ క్రీస్తు, మహమ్మదు ప్రవక్త, ఫతేఘడ్ వాస్తవ్యులైన శ్రీరామచంద్రజీ, మరియు షాజహాన్ పూర్ వాస్తవ్యులైన శ్రీ రామచంద్రజీ ఈ పరంపరకు చెందిన వారు. వారి ఆధ్యాత్మిక జీవితములలోను మరియు బోధనలలోను పోలికలుండుట మనము గమనించవచ్చును. ఇటువంటి ఉన్నతులను మరియు మరెందరినో ప్రస్తావించి, వారిని మూలముగా చెప్పుకొనినను, ఆధ్యాత్మిక పరంపర అనునది బహు సనాతనమైనది. వాస్తవముగా యిది కాలమునకు అతీతము. ఆవిధముగా షాజహాన్‌పూర్ వాస్తవ్యులైన పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు సనాతన పురుషులని మనము చెప్పవచ్చును. వారి సందేశములు మరియు బోధనలు సజీవమైనవి.

ప్రాణశక్తి యొక్క సందేశమును అన్వేషించు సాధకులకు, దానిని అందించుటకు యెల్లపుడు సజీవమైన గురుదేవులు ఉందురు. వారు శారీరకముగా ఉండవలసిన అవసరము లేదు. ఇటువంటి గురుదేవులలో షాజహాన్‌పూర్ వాస్తవ్యులైన పూజ్య శ్రీ రామచంద్రజీ, సూక్ష్మ శరీరములో (Astral Plane) ఆ కార్యమును అమలు పరచుటకు నిర్దేశింపబడిన సజీవ గురుదేవులు. ఇదియే గాక కాలశక్తిని ఉపయోగించి మానవ చైతన్యమును పరిశుద్ధము చేయు కార్యము కూడ ప్రకృతిచే వీరికి అప్పగించబడినది. ఈ భూమిపై కాలశక్తి, ప్రాణశక్తికి వ్యతిరేకమైనదైనప్పటికి, కాలశక్తి ప్రాణశక్తికి మరియొక పార్శ్వముగా గ్రహించవలెను.

మనము శ్రీ రామచంద్ర చైతన్యము అను పదమును ఉపయోగించినపుడు, దీనిని నిత్యమైన ప్రాణశక్తిగా అర్థము చేసుకొనవలెను. సృష్టిలోని జీవుల నడుమ భేద భావము లేని పరిశుద్ధ అమలినమైన ప్రేమయే ఈ చైతన్యము యొక్క ప్రభావము. పసిడిగా వర్ణించదగిన యిది ప్రస్తుతము గురుదేవుల హృదయమునుండి ప్రసరించుచున్నది. ఎల్లలు లేని నిరంతరమైన ఈ ఆనంద ప్రవాహము మూలమునుండి వీరి హృదయము ద్వారా ప్రసరించును. ఇది ప్రస్తుత కాలమునకు గురుదేవులైన వీరికి లోబడిన సాధకులకు ఆనంద సాగరపు అలలవలె అనుభవములోనికి వచ్చును.

దీనినే ప్రాణాహుతిగా అనుభవించుచు ఆనందించెదమని మనకు తెలియును.

* * *

(పూజ్యులైన శ్రీ కె.సి.నారాయణ గారి బోధయంతి పరస్పరం మొదటి సంపుటిలోని Sri Ramchandra Consciousnessకు తెలుగులో స్వేచ్ఛానువాదము. పాఠకులు మరింత అవగాహనకు లేదా సందేహనివృత్తికి ఆంగ్లరచనయే ప్రామాణికముగా తీసుకొనవలసినదిగా మనవి చేసుకొనుచున్నాను. - వి.రామం)